క్లుప్తంగా

డ్వామా పీడీగా కె.వెంకట సుబ్బారావు



డ్వామా పీడీ వెంకట సుబ్బారావు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా కె.వెంకటసుబ్బారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటసుబ్బారావును రాష్ట్ర ప్రభుత్వం ఏలూరు జిల్లా డ్వామా పీడీగా నియమించింది. గురువారం డ్వామా ఆఫీస్‌లో వెంకటసుబ్బారావు పీడీగా బాధ్యతలు స్వీకరించారు. వెంకట సుబ్బారావుకు డ్వామా కార్యాలయం సిబ్బంది పూల మొక్కను అందించి అభినందనలు తెలిపారు.

వన్‌స్టాప్ సెంటర్ సేవలపై విస్తృత ప్రచారం



ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

ఏలూరు (టూటౌన్): వన్‌స్టాప్ సెంటర్ అందించే సేవలపై విస్తృత ప్రచారం చేయాలని జిల్లా న్యాయసేవాధికారం సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని వన్‌స్టాప్ సెంటర్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వన్‌స్టాప్ సెంటర్‌లో నిర్వహిస్తున్న రిజిష్టర్లను తనిఖీ చేశారు. ఫిర్యాదులను ఆన్‌లైన్ సమోదు ప్రక్రియ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వన్‌స్టాప్ సెంటర్‌లో ఉన్న బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని బాధితులకు అవసరమైన పక్షంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలియజేశారు. వన్‌స్టాప్ సెంటర్ అందించే సేవలపై ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ అడ్మిన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూజివీడు ఆర్డీవో



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేస్తున్న నూజివీడు ఆర్డీవో

ఏలూరు (మెట్రో) : నూజివీడు ఆర్డీఓగా నియమితులైన యం.వాణి శుక్రవారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలుసుకొని పూలమొక్కను అందజేశారు. గతంలో కృష్ణాజిల్లా మచిలీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారిగా పనిచేసిన వాణి నూజివీడుకు బదిలీపై వచ్చారు.

కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

దెందులూరు: కూటమి ప్రభుత్వానిది మంచి ప్రభుత్వామా.. చెడ్డ ప్రభుత్వామా అని చెప్పాల్సింది ప్రజలేగాని సచివాలయ ఉద్యోగులు కాదు కదా అని దెందులూరు మాజీ ఏఎంసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అప్పనప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతో స్టిక్కర్లు ఇచ్చి ఇంటింటికీ వెళ్లి అతికించాలని ఒత్తిడి చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వ వైఫల్యం చెందిందని అన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దారి మళ్లించేందుకు లడ్డూ వివాదాన్ని చంద్రబాబు సృష్టించడం దుర్మార్గమన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా అర్హుల పెన్షన్లను టీడీపీ నాయకులు సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి నాలుగు నెలలుగా నిలుపుదల చేయడం దుర్మార్గమని ప్రసాద్ అన్నారు.

పాఠశాలల్లో అసంపూర్తిగా అభివృద్ధి పనులు

- పట్టించుకోని ప్రభుత్వం
- మొండిగోడలు దర్శనం
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ 4.1కోట్లు మంజూరు
- కూటమి ప్రభుత్వం హయాంలో మంజూరు కాని నిధులు



చాటపర్రు జెడ్పీ పాఠశాలలో దర్శనమిస్తున్న మొండి గోడలు



నిధుల లేమితో నిలిచిపోయిన ప్రత్తికోళ్లలంక జెడ్పీ పాఠశాల ప్రహరీ నిర్మాణం



అసంపూర్తిగా చాటపర్రు జెడ్పీ పాఠశాల తరగతి గది



వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి చెందిన గుడివాకలంక మండల పరిషత్ పాఠశాల



వైఎస్సార్‌సీపీ హయాంలో మండల పరిషత్ పాఠశాలలకు అందిన టేబుళ్లు

ఏలూరు రూరల్ : కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైనప్పటికీ ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి పనులు పునఃప్రారంభం కాలేదు. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్టు, గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పథకం ద్వారా జరిగిన పనులు, అక్కడితోనే నిలిచిపోయాయి. ఈ పనుల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులు విడుదల చేయగా, కూటమి ప్రభుత్వం నేటి వరకూ ఒక్కపైసా కూడా విదల్చలేదు. కనీసం అసంపూర్తిగా నిలిచిన పనులనైనా పూర్తి చేసేందుకు అధికారులకు అవకాశం ఇవ్వడం లేదు.

నిర్లక్ష్యానికి నిలువుటద్దం

10 గ్రామ పంచాయతీల్లో ఉన్న జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో మొండిగోడలు, బోడి గోడలు, కిటికీ, తలుపులు లేని తరగతి గదులు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యానికి సాక్షులుగా మారాయి. రెండో దశ పనుల్లో భాగంగా చాటపర్రులో రూ.80 లక్షలతో చేపట్టిన జెడ్పీ పాఠశాలలో పనుల ప్రగతిని పట్టించుకునే వారు కరువయ్యారు. గుడివాకలంక జెడ్పీ పాఠశాల మంజూరైన తరగతి గదుల సంఖ్య కుదించారు. ప్రత్తికోళ్లలంక జెడ్పీ పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ పనులు సైతం నిలిచిపోయాయి. ప్రహరీ పనులు చేపట్టకపోవడంతో పాఠశాల ఆవరణలోకి పశువులు, శునకాలు, పాముల సంచారం పెరగడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వీటికి తోడు తిమ్మారావుగూడెం, కాట్లంపూడి, మానూరు, మహేశ్వరపురం, శ్రీపర్రు గ్రామాల్లోని క్రైస్తవ మిషనరీ సంస్థలు నిర్వహిస్తున్న పాఠశాలల విద్యార్థులకు మంజూరైన మరుగుదొడ్ల నిధులు నిలిచిపోయాయి.

గతం ఎంతో ఘనం

గత ఐదేళ్ల ప్రభుత్వ పాఠశాలలకు స్వర్ణయుగంలా మారింది. జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య, అవసరాలకు అనుగుణంగా వసతుల కల్పనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో 4.1 కోట్లు విడుదల చేసింది. మొదట విడతగా రూ.2.6 కోట్లు, రెండు విడతగా 1.95 కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తంతో 9 పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. ఈ నిధులతో అధికారులు కొన్నేళ్లుగా చాలచాలనీ ఇరుకు గదుల్లో చదువుకుంటున్న పిల్లలకు విశాలమైన తరగతి గదులు నిర్మించారు. ఏళ్ల తరబడి నేలపై కూర్చుని చదువుకున్న బాలబాలికలకు నాణ్యమైన డెస్క్, బెంచీలపై అందుబాటులోకి వచ్చాయి. బ్లాక్‌బోర్డులు పోయి, వాటి స్థానంలో ఆన్‌లైన్ పాఠాలు నేర్పే స్క్రీన్లు చేరాయి. అపరిశుభ్రత తాండవించే మరుగుదొడ్లు సైతం మెరుగుపడ్డాయి. పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలాలు, సురక్షిత తాగునీరు అందించేందుకు ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. తరగతి గదులు ఫ్లోరింగ్ సైతం అందమైన మార్బుల్స్‌తో సుందరంగా మారాయి. మొత్తంగా పాఠశాలలు రూపురేఖలు రంగురంగుల సీతాకోక చిలుకల్లా మారిపోయాయి.

అభివృద్ధి కొనసాగాలి



పేద, బుడుగు వర్గాల పిల్లలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. అందుకే ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పిల్లలు చదువుకునే పాఠశాలల అభివృద్ధి ఆగకూడదు. పిల్లలకు మరింత మెరుగైన వసతులు కల్పించాలి. నాణ్యమైన విద్య అందించాలి. వైఎస్సార్‌సీపీ హయాంలో పాఠశాలలు అభివృద్ధి చెందాయి. కూటమి ప్రభుత్వం కూడా మరిన్ని అభివృద్ధి పనులు కొనసాగించాలి. అప్పుడు పేద విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా మారుతారు.

– ఎండీ సుభాని, ఏలూరు

పనులు పూర్తి చేయాలి



కూటమి ప్రభుత్వ హయాంలో చాటపర్రు జెడ్పీ పాఠశాల పనులు పూర్తిగా నిలిచిపోయాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.80 లక్షలు విడుదల చేశారు. ఈ మొత్తంతో తరగతి గదులు నిర్మాణం ప్రారంభించారు. అధికారులు ఈ పనులు పూర్తి చేయాలి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరిన్ని నిధులు విడుదల చేసి అభివృద్ధి కొనసాగించాలి. లేకపోతే పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు.

– గుడిపూడి రఘు, చాటపర్రు సర్పంచ్

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన 16 జట్లు



బాస్కెట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న ఏలూరు- విజయవాడ క్రీడాకారులు

ఏలూరు రూరల్ : క్రీడల అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారం అందిస్తామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఏలూరులో మోహన్ మెమోరియల్ బాస్కెట్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన మహేష్ యాదవ్ మాట్లాడుతూ క్రీడలు బాలబాలికల్లో మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయన్నారు. మరో అతిథి ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరులో నిర్వహించనున్న పోటీలకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకులు, స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బాస్కెట్‌బాల్ కోర్టు చుట్టూ ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని అతిథులను కోరారు. దీనిపై స్పందించిన మహేష్ యాదవ్ ఎంపీ ల్యాండ్స్ నిధుల నుంచి ఫ్లడ్ లైట్ల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, అమలాపురం తదితర ప్రాంతాల నుంచి 16 జట్లు తరలివచ్చాయి. రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ చక్రవర్తి మాట్లాడుతూ పోటీలు మూడు రోజులు పాటు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి టీడీపీ నాయకులు గంటా మురళీ, డీఈఓ ఎస్. అబ్రహంతో పాటు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

35 మంది సీఆర్‌ఆర్ విద్యార్థుల రక్తదానం



సీఆర్‌ఆర్ పీజీ కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్ రెడ్డి పీజీ కళాశాలలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 35 మంది విద్యార్థులు రక్తదానం చేశారని జిల్లా రెడ్ కాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఏటా సీఆర్ రెడ్డి సంస్థల కళాశాలల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు రక్తదానం చేయడం ద్వారా తలసేమియా, సికిల్ సెల్, ఎనీమియా వ్యాధిగ్రస్త చిన్నారులకు రక్తమార్పిడి చేయగలుగుతున్నామన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులకు కృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు. సీఆర్ రెడ్డి పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ రక్తదానంపై అవగాహన కల్పించి ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కే వరప్రసాదరావు, ఏలూరు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఆర్‌వీ రమణ, డాక్టర్ జీ.స్పందన, పీఆర్‌ఓ కేవీ రమణ పాల్గొన్నారు.

6 నుంచి ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు



ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ అబ్రహాం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను, ఆహ్వాన పత్రాలను ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహాం శుక్రవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. విద్యా వైజ్ఞానిక మహాసభల్లో విద్యా రంగం అభివృద్ధికి తీర్మానాలు చేస్తారని, అందుకు ఈ మహాసభలు ఉపయోగపడాలని కోరారు. రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ జి.కృష్ణ మాట్లాడుతూ విజయనగరంలో జగన్నాథ కల్యాణ మండపం ఫుల్‌బాగ్ రోడ్డులో ఈనెల 6,7,8 తేదీల్లో నిర్వహించనున్న 20వ విద్యా, వైజ్ఞానిక మహాసభలు, 80 వసంతాల ఓక్ జూబ్లీ వేడుకలను విజయవంతం చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. రత్నం బాబు, జీ. మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్, టైలరింగ్ శిక్షణ

దెందులూరు: మహిళలు, నిరుద్యోగ యువతీ యువకులకు మండలంలోని గోపన్నపాలెంలోని సెయింట్ ఫ్రాన్సిస్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా ఉచితంగా రెండు నెలల పాటు కంప్యూటర్, టైలరింగ్, జిగ్ జాగ్ లాంటి విభాగాల్లో ఉచితంగా శిక్షణనిస్తామని కరస్పాండెంట్ బ్రదర్ జోసెఫ్ కుమార్ తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	08
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	22
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	23
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	10
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	08
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	22
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు – తిరుపతి	16.00	4830	28

ఎల్ఐసీ ఏకపక్ష ప్రణాళికను రద్దు చేయాలి



ఏలూరు ఎల్ఐసీ బ్రాంచి-1 వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు, సీఐటీయూ నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఎల్ఐసీ ఏజెంట్లతో సంప్రదింపులు లేకుండా ఏకపక్షంగా కొత్త ప్రణాళికను ఆమోదించడాన్ని ఎల్ఐసీ ఏజెంట్స్ ఆఫ్ ఇండియా, సీఐటీయూ ఏలూరు నగర కమిటీలు తీవ్రంగా ఖండించాయి. భారత జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ ఆఫ్ ఇండియా) ఐఆర్‌డీఏ నిబంధనలను అనుసరించి ఏకపక్షంగా యూనియన్ నాయకులతో, ఏజెంట్లతో సంప్రదింపులు, చర్చలు లేకుండా కొత్త విధానాలను ప్రారంభించడాన్ని నిరసిస్తూ స్థానిక ఏలూరు బ్రాంచి-1 వద్ద ఎల్ఐసీ ఏజెంట్లు ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం నల్లని రిబ్బన్లు ధరించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎల్ఐసీ ఏఓఐ స్టేట్ కమిటీ జనరల్ సెక్రటరీ గొట్టాపు రవికిషోర్, సీఐటీయూ ఏలూరు నగర కార్యదర్శి జె.గోపి మాట్లాడారు. కమిషన్‌పై ఆధారపడుతున్న ఏజెంట్ల పొట్ట కొట్టే విధంగా ప్రభుత్వం అవలంభిస్తున్న దుర్మార్గపు చర్యలను తీవ్రంగా ఖండించారు. పాలసీదారులు తీసుకున్న రుణాలపై అధిక వడ్డీ రేట్లు విధించడాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలు తమ జీవిత భద్రత కోసం చేసుకున్న ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీ పన్నులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెంట్లకు పాత విధానంలోనే కమిషన్ ఇవ్వాలని ఐఆర్డీ ఏకపక్ష నిర్ణయాలను విరమించాలని లేని పక్షంలో దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ నాయకులు బి.రామ్మోహనరావు, ఏలూరు-1 బ్రాంచి కోశాధికారి వైఎస్ కనకారావు, ఇన్‌చార్జి తాళం సురేష్, కోడె రాంబాబు, సీఐటీయూ నాయకులు బొడ్డేపల్లి చంద్రశేఖర్, చక్రాల అమర్ కుమార్, భీమడోలు శాటిలైట్ కార్యాలయం సెక్రటరీ సుబ్బారావు, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి సీహెచ్‌వీ హనుమంతరావు, పలువురు కమిటీ సభ్యులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా దేవీ నవరాత్రి మహోత్సవాలు



గజలక్ష్మి అలంకరణలో బావిశెట్టివారి పేట కనకదుర్గమ్మ



చిన్నారులకు కుమారి పూజలో భాగంగా కాళ్లకు పసుపు రాస్తున్న తల్లులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరంలో గురువారం ప్రారంభమైన శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాల రెండవ రోజున నగరంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవార్లకు ఉదయం విశేష పూజలు చేసి, కుంకుమార్చనలు నిర్వహించారు. స్థానిక వన్‌టౌన్‌లోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి సంతోషిమాతగా అలంకరించారు. స్థానిక పడమరవీధిలోని ఆదిమహాలక్ష్మి అమ్మవారిని కాశీఅన్నపూర్ణగా అలంకరించారు. స్థానిక రామకృష్ణాపురంలోని కనకదుర్గమ్మను గాయత్రిదేవిగా అలంకరించారు. బావిశెట్టివారి పేటలోని అమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిననాగేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కొత్తపేటలో వైభవంగా బాల పూజ

స్థానిక కొత్తపేటలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ మహిళా కమిటీ నిర్వాహకులు వెన్నెల కోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో కుమారి పూజ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండు నుంచి పదేళ్ల బాలికలను అమ్మవారి శక్తి స్వరూపిణిగా భావించి కాళ్లు కడిగి పసుపు రాసి కుంకుమతో పారాణి పెట్టి పువ్వులు, గంధం, అక్షింతలతో వేదమంత్రాలతో బాల పూజ నిర్వహించారు.

ఇఫ్టూ రాష్ట్ర సదస్సు కరపత్రాల ఆవిష్కరణ



విజయవాడలో నిర్వహించనున్న ఇఫ్టూ రాష్ట్ర సదస్సుపై కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): విజయవాడలో ఈ నెల 18న నిర్వహించనున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఇఫ్టూ అనుబంధ ఏలూరు మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఇఫ్టూ రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, నగర కమిటీ ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు మాట్లాడారు. దేశంలోని కార్మిక వర్గం తమ హక్కులు, సౌకర్యాల కోసం ఎంతో కాలంగా పోరాడుతూనే ఉన్నారన్నారు. రెండవసారి 2019లో మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశ పెట్టారన్నారు. మూడోవసారి మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని కార్మిక వర్గ హక్కులు, సౌకర్యాల కోసం ప్రభుత్వరంగ సంస్థల అభివృద్ధికి చర్యలు తీసుకోకుండా మూడు కొత్త క్రిమినల్ కోడ్‌లను ప్రవేశపెట్టి ప్రజలపై పెను దాడి చేయడానికి అతివేగంగా ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమానికి ఘడసాల రమణ, ఎం.రాము, కోరాడ అప్పారావు, మీసాల రమణ, తాబేలు శ్రీను, మజ్జి శ్రీను, రెడ్డి నాయుడు, చిన్నమనాయుడు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలో విజేతలకు బహుమతులు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు శుక్రవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఫారమ్ ఆఫ త్రీ ఎంటర్‌ప్రైజెస్ (ఔట్‌సైడ్ ముంబయ్) సంస్థచే డిజిటల్ మౌలిక సదుపాయాలు – భారతదేశ సమగ్రతకు నూతన వ్యూహం అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 60 మంది విద్యార్థినులు పాల్గొనగా బీఎస్సీ మూడవ సంవత్సరం విద్యార్థిని పీ. లావణ్య ప్రథమ, బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కే. భాను ప్రణతి, ద్వితీయ బీఎస్సీ విద్యార్థిని ఎంజీఎల్ ప్రవల్లిక తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఈ పోటీలకు జీవీఎస్ రవీంద్ర బాబు, పీహెచ్‌ఎస్‌వీ సుబ్బారావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్స్‌పాల్ జీ. సరళ కార్యక్రమం పర్యవేక్షించారు. అనంతరం విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు.